

మడకశిరలోని ఓ పెట్రోల్ బంకు వద్ద నిలిచిపోయిన అమరాపురం మండలానికి చెందిన 108 వాహనం

మడకశిర నియోజకవర్గంలోని 108 వాహనాలకు సుస్తీ చేసింది. మడకశిర, గుడిబండ, అమరాపురం మండలాల్లో 108 వాహనాలు షెడ్లకు చేరడంతో పేదల ప్రాణాలకు గ్యారెంటీ లేకుండా పోయింది. ఆపద సమయాల్లో 108 వాహనాలు రాకుండా పోతుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- మడకశిర, గుడిబండ, అమరాపురం మండలాల్లో షెడ్లకు చేరిన 108 వాహనాలు
- సేవలు నిలిచిపోవడంతో పేదల ఇబ్బందులు
- అనుకోని సంఘటన జరిగితే ప్రాణాలు పోగొట్టుకునే పరిస్థితులు
- ప్రభుత్వ తీరుపై అన్ని వర్గాల ప్రజల ఆగ్రహం

పేదల ప్రాణాలతో చెలగాటం !



గుడిబండలో ఇలా...

మడకశిర: జిల్లాలో మడకశిర నియోజకవర్గం పూర్తిగా కర్ణాటక సరిహద్దుకు ఆనుకుని ఉంది. ఇక్కడున్న 5 మండలాల పరిధిలో 334 గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాలన్నీ పూర్తిగా కర్ణాటక సరిహద్దులోని మారుమూల ప్రాంతంలో ఉన్నాయి. 90 శాతం ప్రజలు పేద వర్గానికి చెందిన వారే. ఇలాంటి పరిస్థితిలో ఈ నియోజకవర్గానికి 108 సేవలు చాలా అవసరం. ప్రధానంగా బాలింతలు, గర్భిణులు మారుమూల ప్రాంతంలో అనారోగ్యం పాలైతే తక్షణమే వారిని 108 వాహనాల్లో ఆస్పత్రులకు తరలించాల్సి ఉంది. అయితే 108 సేవలు గత కొన్ని రోజుల నుంచి ప్రజలకు పూర్తి స్థాయిలో అందడం లేదు. ఈ సేవల్లో అంతరాయం ఏర్పడుతుండటంతో పేదలు వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్నారు.

కూటమి ప్రభుత్వం వచ్చాకే దుస్థితి

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నియోజకవర్గంలో 108 సేవలు పేదలకు పూర్తిస్థాయిలో సకాలంలో అందేవి. 108 వాహనాలు ఎప్పుడూ కండీషన్‌లో ఉండేవి. దీంతో 108 సేవలు అంతరాయం లేకుండా కొనసాగేవి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 108 సేవల్లో తీవ్ర అంతరాయం కలుగుతోంది. సకాలంలో 108 సేవలు అందడం లేదని ప్రజలు వాపోతున్నారు. 108 సేవలు సక్రమంగా అందే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రధానంగా 108 వాహనాలకు మరమ్మతు చేయించకపోవడంతో అవి మూలన పడుతున్నాయి. ఎక్కడపడితే అక్కడ మొరాయిస్తున్నాయి.

మూడు మండలాల్లో నిలిచిన సేవలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 5 మండలాలకూ 108 వాహనాలను కేటాయించారు. అంతకు ముందు 3 మండలాల్లోనే 108 వాహనాలు ఉండేవి. అయితే వైఎస్ జగన్ పేదల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అన్ని మండలాలకు 108 వాహనాలను కేటాయించి అండగా నిలిచారు. ప్రస్తుతం మడకశిర, గుడిబండ, అమరాపురం మండలాల్లో 108 సేవలు ఆగిపోయాయి. ఈ మండలాలకు చెందిన వాహనాలు మూలన పడ్డాయి. మరమ్మతు చేయించకపోవడంతో వాటికి ఆ దుస్థితి ఏర్పడింది. మడకశిర మండలానికి చెందిన వాహనం ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ ఆవరణంలో నిలిచి పోయింది. అమరాపురం మండలానికి చెందిన వాహనాన్ని మడకశిరలోని ఓ పెట్రోల్ బంకు ఆవరణంలో నిలబెట్టారు. గుడిబండ మండలానికి చెందిన వాహనాన్ని ఆస్పత్రి ఆవరణంలో నిరుపయోగంగా ఉంది. సకాలంలో వాహనాలకు ఈ ప్రభుత్వం మరమ్మతు చేయించలేకపోయింది. దీంతో ఈ మూడు మండలాల్లో 108 సేవలు పూర్తిస్థాయిలో అందక పేదలు ఇబ్బందులు పడుతున్నారు.



మడకశిరలో మరమ్మతుకు గురైన వాహనం

108 సేవలకు అంతరాయం



108 సేవలు సక్రమంగా అందక పేదలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మడకశిర, గుడిబండ, అమరాపురం మండలాల్లో 108 సేవలు ఆగిపోయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రజలు అత్యవసర వైద్య సేవలకు నానా ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలకు మరమ్మతులు లేకపోవడంతోనే ఈదుస్థితి ఏర్పడింది. వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకుని 108 సేవలు పూర్తిస్థాయిలో అందే విధంగా చూడాలి.

– ధను, మడకశిర

ప్రభుత్వ తీరుకు నిదర్శనం



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 108 సేవలు సక్రమంగా అందడం లేదు. ఫలితంగా పేదలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. వైఎస్ జగన్ హయాంలో 108 సేవలు సక్రమంగా అందేవి. ప్రస్తుతం మారుమూల ప్రాంతమైన మడకశిర నియోజకవర్గంలో 108 సేవలను సక్రమంగా అందించడంలో ప్రభుత్వం విఫలమైంది. మరమ్మతు లేక వాహనాలు నిరుపయోగంగా మారాయి. కూటమి ప్రభుత్వ పనితీరు అధ్వానంగా మారింది అనడానికి ఇదే నిదర్శనం. వెంటనే ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని 108 సేవలను పూర్తిస్థాయిలో అందించి పేదలను ఆదుకోవాలి.

– ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మడకశిర

ప్రజలను వంచించిన ఏకైక సీఎం చంద్రబాబు



చిలమత్తూరు: పోస్టర్లు విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక, నాయకులు



అమరాపురం: పోస్టర్లు విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప తదితరులు

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు దీపిక , ఈరలక్కప్ప

చిలమత్తూరు: 'సూపర్‌సిక్స్ హామీలంటూ అధికారంలోకి వచ్చిన చంద్రబాబు అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా సంక్షేమ పథకాలను అమలు చేయకుండా కథలు అల్లుతున్నాడు. ప్రజలను వంచించిన ఏకైక సీఎంగా చంద్రబాబు నిలిచిపోయారు' అని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఎంపీపీ, జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తమరెడ్డి, మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డితో కలిసి ''వెన్నుపోటు దినం'' పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం దీపిక మాట్లాడుతూ బాబు ఎప్పుడూ అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను వంచిస్తూ పబ్బం గడుపుకుంటున్నారన్నారు. ఏడాదిగా ప్రజలు ఆర్థికంగా చితికిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. జూన్ 4న కూటమి ప్రభుత్వం పరిపాలనకు ఏడాది పూర్తవుతోందని, హిందూపురం పట్టణంలో నిర్వహించబోయే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ ముఖ్య నేత వేణురెడ్డి, జిల్లా బూత్ కన్వీనర్ వాల్మీకి లోకేష్, సర్పంచ్ సంధ్య, ఎంపీటీసీలు రాఘవేంద్రరెడ్డి, ఆదినారాయణ, నాయకులు సురేష్‌కుమార్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, గిరీష్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, నాగభూషణరెడ్డి, చిన్నప్పయ్య, నయిముల్లా, నవాబ్,రంగారెడ్డి, నవీన్, నంజిరెడ్డి, నారాయణస్వామి, షాకీర్, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షిలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో 4వ తేదీన జరిగే వెన్నుపోటు దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ నిస్సార్ అహ్మద్ పిలుపునిచ్చారు. ఇందులో భాగంగానే నాయకులతో కలిసి సోమవారం పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు బషీర్, నాయకులు రవీంద్రరెడ్డి, మాధవరెడ్డి, వెంకటేష్, తిప్పన్న, రామాంజినేయులు, అన్సార్, నరసప్ప, భాస్కర్‌రెడ్డి, లోక్‌నాథ, ఈశ్వర్‌రెడ్డి, మూర్తి, అంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: ఎన్నికల సమయంలో ఓట్ల కోసం అమలు కాని హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చిన ప్రజలను వంచించిన కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈ నెల 4వ తేదీ చేపట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడుతూ హామీల అమలు చేయని కూటమి సర్కారు రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి బాకీ పడిందన్నారు. ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్‌లు అమలు చేయకుండా వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు లక్ష్యంగా కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్, ఎస్సీ, బీసీ, ఐటీ వింగ్ అధ్యక్షులు శివన్న, శివకుమార్, చిత్తయ్య, పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి నటరాజు తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 4న నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను సోమవారం మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడు ఆవిష్కరించారు. ఈరలక్కప్ప మాట్లాడుతూ ప్రజలను వంచించిన కూటమి ప్రభుత్వానికి త్వరలో ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్, సర్పంచులు కరుణాకర్ గౌడు, హనుమంతరాయప్ప తదితరులు పాల్గొన్నారు.

బలవంతపు భూసేకరణ ఆపాలి



ఆర్డీఓ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న రైతులు, నాయకులు

పెనుకొండ రూరల్: హిందూపురం, లేపాక్షి మండలంలో బలవంతపు భూ సేకరణ ఆపాలంటూ ఏపీ రైతు సంఘం నాయకులు నిరసన తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకూ చలివెందుల, రాచపల్లి, మలగురు, మీనకుంటపల్లి, కొండూరు, వడ్డివల్లి, తిమ్మగానిపల్లి గ్రామాల రైతులు ర్యాలీ చేపట్టారు. బలవంతపు భూ సేకరణ ఆపాలని నినాదాలు చేశారు. అనంతరం ఆర్డీఓ ఆనంద్ కుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. నాయకులు మాట్లాడుతూ ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే గ్రామ సభలను అధికారులు ఏర్పాటు చేయడం సరికాదన్నారు. 80 శాతం మంది రైతుల ఆమోదం లేకుండానే బలవంతపు భూ సేకరణ చేయడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. పరిశ్రమల పేరుతో గతంలో పరిగి, హిందూపురం మండలాల్లో సేకరించిన వేల ఎకరాల భూములను ఏం చేశారో చెప్పాలన్నారు. బలవంతపు భూసేకరణ ఆపకపోతే రైతులతో కలిసి ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి రామకృష్ణ, జిల్లా కార్యదర్శి పెద్దన్న, జిల్లా అధ్యక్షుడు హరి, సిద్దారెడ్డి, ఫక్రుద్దీన్, వేమారెడ్డి, రామలింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు పరామర్శ

పెనుకొండ రూరల్: మండలంలోని మునిమడుగు పంచాయతీ చిన్నపరెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బోయ నరసింహులు ఓ ప్రమాదంలో గాయపడ్డాడు. ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్న నరసింహులును సోమవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడగి తెలుసుకున్నారు. ఆమె వెంట వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ వెంకటరెడ్డి తదితరులున్నారు.

మునిమడుగులో బాధిత కుటుంబానికి...


పెనుకొండ రూరల్: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఉప సర్పంచ్ గొల్ల గంగాధర్ అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందారు.



వైఎస్సార్‌సీపీ కార్యకర్తను పరామర్శిస్తున్న జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ మునిమడుగు గ్రామానికి సోమవారం చేరుకొని గంగాధర్ మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

వేంకటరమణస్వామి నమోస్తుతే




హిందూపురం: పట్టణంలోని మెయిన్‌బజార్‌లోని పేట వేంకటరమణ స్వామి దేవస్థానంలో సోమవారం ఉదయం మూలవిరాట్ వెంకట రమణ స్వామి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. మామిడిపండ్ల తోరణంతో మామిడి పండ్ల నైవేద్యాలతో పూజలు చేశారు. మహామంగళ హారతులిచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలతో ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత పేట వెంకటరమణ స్వామి ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుదీర్చి మంగళ వాయిద్యాలతో ప్రాకారోత్సవం నిర్వహించారు.

హామీలు అమలు చేయాలి


సోమందేపల్లి: ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీ ప్రాంతాల్లో మూడు సెంట్ల చొప్పున పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బాలస్వామి, రాజ్ గోపాల్, నారాయణ స్వామి, చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం: పేదల గుడిసెలు వేసుకున్న ప్రాంతంలో ఇంటిపట్టాలు మంజూరు చేసి ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు అందించాలని సీపీఐ మండల కార్యదర్శి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం హిందూపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కార్యక్రమంలో బాబు, మారుతీరెడ్డి, చలపతి, నరసింహమూర్తి, జబీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అక్కమ్మగార్ల ఉత్సవం



పూజల్లో పాల్గొన్న దీపిక దంపతులు



ఉత్సవానికి పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు

చిలమత్తూరు: మండల కేంద్రానికి సమీపంలోని పెక్కొలచెరువు వద్ద వెలసిన సప్తమాతృక ఏడుగురు అక్కమ్మగార్ల ఉత్సవాన్ని గ్రామస్తులు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉపవాసదీక్షలతో అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. వాల్మీకుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవానికి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. అర్చకులు దీపిక వేణురెడ్డి దంపతులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ జనార్దన్, ఎస్‌ఐ మునీర్ అహ్మద్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

క్లుప్తంగా

కార్మికశాఖ నూతన అధికారిగా కృష్ణయ్య



పెనుకొండ రూరల్: పెనుకొండకు కార్మికశాఖ అధికారిగా కృష్ణయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీలో భాగంగా రాయదుర్గంలో పనిచేస్తున్న కృష్ణయ్యను పెనుకొండకు బదిలీ చేసింది. ఇందులో భాగంగానే ఆయన బాధ్యతలు చేపట్టి మాట్లాడారు. కార్మికులకు నిత్యం అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

వివిధ సమస్యల పరిష్కారానికి 12 అర్జీలు

పెనుకొండ రూరల్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం డివిజన్ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ సమస్యల పరిష్కారానికై ప్రజల నుంచి 12 అర్జీలు అందించినట్లు డీటీ ప్రసాద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

పెనుకొండ: రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త వహించాలని ఎస్ఐ. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. పట్టణంలోని 44వ జాతీయ రహదారిపై సోమవారం రోడ్డు ప్రమాదాల నివారణపై వాహనదారులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు.

రేషన్ షాపు తనిఖీ



స్టాకును పరిశీలిస్తున్న తహసీల్దార్

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షిలోని రేషన్ షాపు–14ను తహసీల్దార్ సౌజన్యలక్ష్మి సోమవారం సాయంత్రం తనిఖీ చేశారు. కార్డు వినియోగదారులు దుకాణం వద్ద పడిగాపులు కాస్తూ ఇబ్బందులు పడుతున్న విషయంపై ఆమె ఆరా తీశారు. ఆమె వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రమీళమ్మ, వీఆర్ఓ రాజేష్ ఉన్నారు.

నేడు యోగా పోటీలు

గోరంట్ల: మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో మంగళవారం మండల స్థాయి యోగా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరేంద్ర పేర్కొన్నారు. మండలస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

సరుకులను సక్రమంగా పంపిణీ చేయండి



గుమ్మయ్యగారిపల్లిలో చౌకధాన్యపు డిపోను తనిఖీ చేస్తున్న ఆర్డీఓ సువర్ణ

గోరంట్ల: మండల పరిధిలోని గుమ్మయ్యగారిపల్లి, మల్లాపల్లి చౌకధాన్యపు డిపోలను సోమవారం సాయంత్రం పుట్టపర్తి రెవెన్యూ డివిజినల్ అధికారి సువర్ణ తనిఖీ చేశారు. రేషన్ సక్రమంగా పంపిణీ జరుగుతుందా లేదా అని లబ్ధిదారులతో ఆమె అడిగి తెలుసుకున్నారు. నిత్యావసర సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని సంబంధిత డీలర్లను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మారుతీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

హిందూపురం టౌన్: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి మాట్లాడుతూ సమస్యలకు నిలయంగా ప్రభుత్వ వసతి గృహాలుగా ఉన్నాయని, విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని వాటిని పరిష్కరించాలన్నారు. అదే విధంగా హాస్టళ్లలో ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

నేలకొరిగిన రావి చెట్టు



పావగడ: పట్టణంలో సోమవారం సాయంత్రం గాలి వాన బీభత్సానికి శిరా రోడ్డులోని నాగుల కట్ట వద్ద ఉన్న భారీ రావి చెట్టు నేల కూలింది. దీంతో ఇళ్లకు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ తీగలు తెగిపోయాయి. ఈ ఘటనలో ఎలాంటి వస్తు, ప్రాణహాని సంభవించలేదు.

నేడు మంగాపురంలో కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ

పెనుకొండ రూరల్: నగర పంచాయతీ పరిధిలోని మంగాపురంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు పట్టణ, మండల కన్వీనర్లు నరసింహులు, సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

మైనార్టీ నాయకులకు సన్మానం



వైఎస్సార్‌సీపీ నాయకులను సన్మానిస్తున్న దృశ్యం

చిలమత్తూరు: హిందూపురం నియోజకవర్గంలోని మైనార్టీ నేతలకు వైఎస్సార్‌సీపీలో నియోజకవర్గ స్థాయి పదవులు దక్కాయి. ఈ సందర్భంగా వారిని హిందూపురం పట్టణంలోని అల్ హిలాల్ ఫంక్షన్‌హాల్‌లో ముస్లింలు ఘనంగా సత్కరించారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ సలాం, నియోజకవర్గ వలంటీర్ విభాగం అధ్యక్షుడు నవీద్, పట్టణ అధ్యక్షుడు ఫైరోజ్ మహమ్మద్‌ను సన్మానించారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్, రీజనల్ కోఆర్డినేటర్ మిథున్‌రెడ్డి, సమన్వయకర్త దీపికలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి

మడకశిర: మధ్యాహ్నం భోజనంలో నాణ్యతగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎంఈఓలు శ్రీనివాస్ భాస్కర్, నరసింహమూర్తి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో అన్ని ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్నం భోజనం పథకం ఏజెన్సీ నిర్వాహకులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆర్డీటీని కాపాడాలని నిరసన



ఆర్డీఓ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న దృశ్యం

పెనుకొండ రూరల్: ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలకు మంచి చేస్తున్న ఆర్డీటీ సేవలు కొనసాగించాలంటూ స్థానిక సాహితీ గగనమహల్ ట్రస్ట్ అధ్యక్షుడు ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో ప్రజలు పట్టణంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓకు వినతిపత్రం ఇచ్చారు. నిస్వార్థంగా పనిచేస్తున్న ఆర్డీటీ సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో కంబాలపల్లి నరేష్, కోగిర ముత్యాలు, మంగాపురం భాస్కర్ నాయక్, తిమ్మప్ప, చాకర్లపల్లి అశ్విని తదితరులు పాల్గొన్నారు.

నిధులు కేటాయిస్తేనే పనులు చేస్తాం



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న సర్పంచులు

రొళ్ల: గ్రామాల అభివృద్ధి కోసం 2024–25 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను గ్రామ పంచాయతీకి కేటాయిస్తేనే తాము పంచాయతీలో అభివృద్ధి పనులు చేపడతామని సర్పంచులు తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం చేరుకుని ఎంపీడీఓ నాగేశ్వరశాస్త్రీకి డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు పంచాయతీలో నిధులు లేవన్నారు. తాము బాధ్యతలు చేపట్టిన తర్వాత రెండు సార్లు మాత్రమే పంచాయతీకి నిధులు కేటాయించారని గుర్తు చేశారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తేనే తాము పంచాయతీలో అభివృద్ధి చేయగలుగుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు సదాశివప్ప, ప్రకాష్,రామలక్ష్మమ్మ, నరసింహప్ప, కరియమ్మ, అనిత, తాలూకా జేసీఎస్ బూత్ ఇన్‌చార్జ్ నాగేంద్ర, ఈసీ మెంబర్ ప్రసన్నకుమార్, ప్రధాన కార్యదర్శి మంజునాథ్, నాయకుడు డి.రవికుమార్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.